క్లుప్తంగా

కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్ నివాళి



లక్ష్మణరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

ఉప్పలగుప్తం: వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్ తండ్రి లక్ష్మణరావు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం కన్నుమూశారు. మండలంలోని చల్లపల్లి పంచాయతీ జగ్గిరాజుపేటలో లక్ష్మణరావు భౌతికకాయానికి పార్టీ అమలాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ముక్తేశ్వరంలో రేపు జాబ్ మేళా

అమలాపురం రూరల్: అయినవిల్లి మండలం ముక్తేశ్వరంలో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డి.హరిశేషు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముక్తేశ్వరంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాల వద్ద శనివారం ఉదయం 10 గంటలకు ఈ జాబ్ మేళా ప్రారంభమవుతుందన్నారు. ఈ జాబ్ మేళాలో 12 కంపెనీల ప్రతినిధులు 662 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా అంతర్జాతీయ ఆహార దినోత్సవం



వంటకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ముమ్మిడివరం: అంతర్జాతీయ ఆహార దినోత్సవాన్ని గురువారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ముమ్మిడివరం బాలాజీ కాన్వెంట్‌లో ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశారు. వివిధ రకాల ఆహార పదార్థాలను విద్యార్థులే స్వయంగా తయారు చేసి ప్రదర్శించారు. బయటి పదార్థాలను తినరాదని, ఇంటి పదార్థాలే ముద్దు అని వివరించారు. ఈ కార్యక్రమంలో పీవీఎస్ శాస్త్రి, పి.సుజాత, హెచ్ఎం రామరాజు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కుట్రపూరితంగా ఇరికించారు

అమలాపురం రూరల్: దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం వల్లే అమలాపురం తహసీల్దార్ అశోక్ ప్రసాద్‌ను కుట్రపూరితంగా స్థానిక నేతలు ఇరికించారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మోకాటి నాగేశ్వరరావు ఆరోపించారు. అమలాపురం మండలం నడిపూడి బాబూజగ్జీవన్ రామ్ భవన్‌లో గురువారం జరిగిన ఎమ్మార్పీఎస్ నాయకుల అత్యవసర సమావేశం తీవ్రంగా ఖండించింది. త్వరలోనే వాస్తవాలు వెల్లడవుతాయని, దీని వెనకున్న సూత్రధారులు, పాత్రధారులు బయటకు వస్తారన్నారు. దళిత అధికారులను ఇరికిస్తున్న తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించాలన్నారు. తహసీల్దార్ అశోక్‌ప్రసాద్‌కు అన్యాయం జరిగితే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు కాప నాగభూషణం, తొత్తరమూడి ప్రభాకరరావు, చేట్ల సత్యనారాయణ, మంద వెంకటేశ్వరరావు, ఉందుర్తి సత్యనారాయణ, నూటుకుర్తి మూర్తి పాల్గొన్నారు.

వాహనాల ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, డీటీవో

అమలాపురం టౌన్: జిల్లా రవాణా శాఖాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జీఎస్టీ రాయితీతో కొనుగోలు చేసిన వాహనాల ర్యాలీని స్థానిక నల్ల వంతెన వద్ద గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, డీటీవో శ్రీనివాసరావు ర్యాలీ ప్రారంభించారు. సీటీవో జగన్ మోహన్‌రెడ్డి, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, ఎంవీఐలు కె.రవికుమార్, జె.సురేష్‌కుమార్, ఏఎంవీఐ డి.కౌశిక్, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వెండి వస్తువుల సమర్పణ



వెండి వస్తువులు అందజేసిన దాతలు

మలికిపురం: మండలంలోని మట్టపర్రులో వేంచేసిన అభయాంజనేయ స్వామి, సాయిబాబా ఆలయాలకు లక్కవరం గ్రామానికి చెందిన భక్తుడు రుద్రరాజు రంగరాజు, వెంకట మంగాయమ్మ దంపతులు, కుటుంబ సభ్యులు రూ.50 వేలతో తయారు చేయించిన వెంట కిరీటం, అభయ హస్తాలను సమర్పించారు. గురువారం ఆలయంలో జరిగిన పూజలో వీటిని అందజేశారు.

లైఫ్‌లైన్ జాగ్రత్త..!

- విద్యుత్ తీగలకు వేలాడుతున్న స్తంభాలు
- తీర గ్రామాల్లో పొంచి ఉన్న ముప్పు
- పటిష్టంగా ఏర్పాటు చేయని కాంట్రాక్టర్లు
- భయాందోళనలో అనేక గ్రామాల ప్రజలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



మురమళ్ల రక్షణ గట్టు వెంబడి అయినాపురం వైపు లైన్‌లో చెట్ల మధ్య ఒరిగిన విద్యుత్ స్తంభం

కాట్రేనికోన: సముద్ర తీర ప్రాంతాలకు వెళ్లే విద్యుత్ స్తంభాలు గాలులకు వాలిపోవడంతో తీగలకు వేలాడుతున్నాయి. గాలుల ఒత్తిడి అధికంగా ఉండే సముద్ర తీర ప్రాంతాల్లో ఇసుక నేలలు, మెత్తని నల్లమట్టి నేలలు అధికంగా ఉంటాయి. ఈ క్రమంలో విద్యుత్ స్తంభాలను నేల స్వభావం, ఈదురు గాలులు తట్టుకునే విధంగా ప్రతి స్తంభానికి బేస్ గట్టిగా వేయాల్సి ఉంటుంది. సముద్ర తీరం వెంబడి వీచే ఈదురు గాలులు, తుపాన్లు, సునామీ వంటి ప్రకృతి వైపరీత్యాలు తట్టుకునేలా కాంక్రీట్ బేస్ నిర్మించాలి. అయితే విద్యుత్ లైన్ వేసేటపుడు సంబంధిత కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించకపోవడంతో స్తంభాలు బలహీనంగా ఉండి వాలిపోతున్నాయి.

మండలంలోని కాట్రేనికోన సబ్ స్టేషన్ నుంచి తీర ప్రాంతాలకు వెళ్లే విద్యుత్ లైన్లు తుపాన్లు, ఈదురు గాలులకు స్తంభాలు వాలిపోయి, విద్యుత్ తీగలకు వేలాడుతూ ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. కాట్రేనికోన సబ్ స్టేషన్ నుంచి చిర్రయానం వెళ్లే లైన్ పర్రభూమి వెంబడి రక్షణ గట్టు పైన, వంతెన నుంచి చిర్రయానం వరకు విద్యుత్ స్తంభాలు వాలిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. కొత్తపాలెం–లైట్ హౌస్‌కు వెళ్లే హెచ్‌టీ స్తంభాలూ వాలిపోయి అత్యంత ప్రమాదకరంగా విద్యుత్ లైన్ ఉంది, పల్లంకుర్రు పంచాయతీ లైన్ పేట, దాసరివారి పేట, పల్లంకుర్రు మీదుగా బలుసుతిప్ప వెళ్లే లైన్, బలుసుతిప్ప–రామాలయం పేట, మొక్కలతిప్ప వరకు వెళ్లే హెచ్‌టీ లైన్ స్తంభాలు ఒరిగిపోయాయి. వాలిపోయిన విద్యుత్ స్తంభాలు ఈదురు గాలులొస్తే ఎవరిపై పడుతుందోనని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కందికుప్ప మీదుగా కొత్తపాలెం లైట్ హౌస్‌కు వెళ్లే హెచ్‌టీ విద్యుత్ లైన్ మరింత దారుణంగా ఉంది. జిరుగు మట్టి కావడంతో స్తంభాలు, లైన్ బరువు అధికం కావడంతో తీగలు ఒరిగిపోయాయి. విద్యుత్ లైన్ వెంబడి స్తంభాలు వాలిపోయి ప్రమాదకరంగా ఉన్నా సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

స్తంభాలపై ఎగబాకుతూ..

ప్రతి వారం ట్రీ కటింగ్ పేరుతో విద్యుత్ కోతలు విధించి సిబ్బంది ఆకులు, తీగ మొక్కలు తొలగిస్తున్నా ఫలితం ఉండడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేసి తమ సిబ్బందితో ఆకులు, తుప్పలు, తీగ మొక్కలు తొలగిస్తున్నట్టు అధికారులు ప్రకటనలు చేస్తున్నారు. ఈ మేరకు ప్రజాధనాన్ని బిల్లుల రూపేణా ఖర్చు పెడుతున్నారు. సిబ్బందితో ఆయా పనులు తూతూమంత్రంగా చేయించడం వల్ల ప్రయోజనం లేదనే విమర్శలున్నాయి. ట్రీ కటింగ్‌ను దింపు కార్మికులు, ట్రీ కటింగ్ చేసే కార్మికులతో చేయిస్తే పూర్తి స్థాయిలో విద్యుత్ అంతరాయం ఉండదని స్థానికులు అంటున్నారు.



కొత్తపాలెం లైట్ హౌస్ రోడ్డులో విద్యుత్ తీగలకు వేలాడుతున్న స్తంభాలు



కుండలేశ్వరం లైన్‌లో విద్యుత్ స్తంభం దుస్థితి

ఆకులు, తీగలను తొలగించడంలో నైపుణ్యం లేని విద్యుత్ సిబ్బందిని వినియోగించడంతో పూర్తి స్థాయిలో పనులు జరగడం లేదంటున్నారు. చిన్నపాటి వర్షాలకు గాలులు వీస్తే ఆకులు విద్యుత్ తీగలపై పడి సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుంది.

> **లైన్ మరమ్మతులు చేయాల్సి ఉంది**
>
> విద్యుత్ లైన్ల మరమ్మతులు చేయాల్సి ఉంది. మండలంలో ఒరిగిపోయిన, శిథిలమైన 38 స్తంభాలను గుర్తించి, ఎస్టిమేషన్ వేసి పంపించాం. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే స్తంభాలను మార్చి, లైన్ మరమ్మతులు చేపడతాం.
>
> – ఎం.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఏఈ, కాట్రేనికోన

18న హుండీ లెక్కింపు

ఐ.పోలవరం: నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 18వ తేదీన హుండీ లెక్కింపు చేపడుతున్నట్టు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ గురువారం తెలిపారు. ఈ లెక్కింపు దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ధర్మకర్త మండలి సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొనాలని సూచించారు.

రాపిడ్ చెస్ టోర్నీలో శాన్వి ప్రతిభ



శాన్విని అభినందిస్తున్న డైరెక్టర్, ఉపాధ్యాయులు

అమలాపురం రూరల్: భీమవరంలో ఈ నెల 12న జరిగిన తెలుగు రాష్ట్రాల ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో అమలాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని బి.శాన్వి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. అండర్–7 బాలికల విభాగంలో మొదటి స్థానం సాధించి ట్రోఫీ, నగదు బహుమతి అందుకుందని కోచ్ వి.శ్రీనుబాబు తెలిపారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో ఓపెన్ రాపిడ్‌లో అండర్–7 బాలికల విభాగంలో మొదటి స్థానాలు సాధించి, ట్రోఫీ, నగదు బహుమతులు అందుకుంది. విజేత శాన్విని సంస్థ చైర్మన్ నాయుడు, డైరెక్టర్ మనువిహార్, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

చెత్తపై కొనసాగుతున్న పోరుబాట



బండారులంకలో రిలే దీక్షలు చేస్తున్న గ్రామస్తులు

అమలాపురం రూరల్: బండారులంక గ్రామంలో చెత్తను తరలించాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం రెండో రోజుకు చేరాయి. పంచాయతీ ఒకటో వార్డు మెంబర్ నూకపెయ్యి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వార్డు పెద్దలు సరెళ్ల మల్లేశ్వరరావు, జాన మల్లిబాబు, రాయుడు వెంకటేశ్వరరావు, నూకపెయ్యి ఆదిలక్ష్మి, ఆశపు పెద్దిరాజు, చింతపట్ల సుబ్రహ్మణ్యం దీక్షల్లో పాల్గొన్నారు. అదేవిధంగా రోజూ ఒకటో వార్డు నుంచి 16వ వార్డు వరకూ ఒక్కొక్క వార్డు ప్రజలు ఒక్కో రోజు చొప్పున దీక్షలు చేస్తామని తెలిపారు. అమలాపురం రూరల్ మండలం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సాకుర్రు సర్పంచ్ గుత్తుల చిరంజీవి, ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీనివాసరావు, జాన గణేష్, రాయుడు రామకృష్ణ, బాసిన బూర్గరావు, బాసిన శివన్నారాయణ, ఊటుకూరు సుబ్రహ్మణ్యం, వాసా దొరబాబు, సరెళ్ల రామకృష్ణ, కుర్మా క్రీస్తుబాబు, గోసంగి శ్రీను తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ సంఘీభావం తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్: ఈదరపల్లి సబ్‌స్టేషన్‌లో మరమతుల కోసం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అమలాపురం పట్టణ, రూరల్ పరిధిలోని 33/11 కేవీ ఉప కేంద్రాలకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు తెలిపారు. అమలాపురం టౌన్, బాలయోగి ఘాట్, కామనగరువు, చల్లపల్లి, అంబాజీపేట, గంగలకురు, కాట్రేనికోన ఉప కేంద్రాలకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. ఆయా ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

తాళ్లరేవు: చొల్లంగి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. చొల్లంగి, చొల్లంగిపేట, పటవల, కొత్తూరు, రామన్నపాలెం, జి.వేమవరం, మట్లపాలెంలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే తాళ్లరేవు సబ్‌స్టేషన్ పరిధిలో ట్రీ కటింగ్ కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కోరంగి, తాళ్లరేవు పంచాయతీ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

నేడు అంతరాయం

అల్లవరం: మండలంలోని అల్లవరం సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు గురువారం తెలిపారు. సబ్ స్టేషన్ ఫీడర్‌లో మరమ్మతుల కోసం సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో అల్లవరం, గోడి, గోడిలంక, గోడితిప్ప, తూర్పులంక, ఎంట్రుకోన గ్రామాలు, తాడికోన, తూర్పులంక, గోడిలంక, రెల్లుగడ్డ ఆక్వా ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే బెండమూర్లంక సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో వార్షిక మరమ్మతులు, ట్రీ కటింగ్ కోసం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తారని తెలిపారు. ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని గృహ, ఆక్వా రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

రేపు సరఫరా నిలిపివేత

ఐ.పోలవరం: మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 18వ తేదీన 33/11, 33 కేవీ సబ్ స్టేషన్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల పక్కనున్న కొబ్బరి చెట్ల ఆకులు, కొమ్మలు తొలగించేందుకు, మరమ్మతుల కోసం ఐ.పోలవరం మండలంలోని అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు తెలిపారు.

ప్రతి వ్యక్తికీ ఓఎన్‌జీసీ పరిహారం ఇవ్వాల్సిందే..



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఏఓ అంకిత్‌కుమార్ తదితరులు

యానాం: మత్స్యకారులకు ఇస్తున్నట్టుగా కుటుంబంలో 18 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తికీ ఓఎన్‌జీసీ పరిహారం ఇవ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గోదావరిలో ఇటీవల ఓఎన్‌జీసీ గ్యాస్ పైపులైన్ లీకేజీ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదం, ఇతర ఘటనల నేపథ్యంలో బాధితులకు జరిగిన నష్టం, గ్రామస్తుల పరిహారం డిమాండ్ తదితర అంశాలపై చర్చించేందుకు గురువారం ఆర్ఏఓ అంకిత్‌కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దరియాలతిప్ప, దొమ్మేటిపేట, సీతారామనగర్ గ్రామస్తులు తమ వాదనలు వినిపించారు. ఐలాండ్ నంబరు–5 రైతాంగ భూముల చుట్టూ రివిట్‌మెంట్ కట్టించాలని కోరారు. గ్రామాల్లో నిరుద్యోగులైన యువకులకు చమురు సంస్థల్లో ఉపాధి కల్పించాలని, గ్రామాలను దత్తత తీసుకుని మౌలిక సౌకర్యాలు కల్పించాలని తదితర డిమాండ్లు ముందుంచారు. ఈ సందర్భంగా ఆర్ఏఓ అంకిత్‌కుమార్ మాట్లాడుతూ, ఆయా సమస్యలను ప్రభుత్వానికి తెలియజేస్తానని, ఓఎన్‌జీసీ ఉన్నతాధికారులతో మాట్లాడతానన్నారు. ఓఎన్‌జీసీ సర్వే చేయడానికి ఆటంకాలు కల్పించవద్దని రైతులను కోరారు. అయితే రైతులు ఆ ప్రతిపాదనకు ఒప్పుకోలేదు. ఈ సమావేశంలో ఎస్సీ రైతాంగ సొసైటీ అధ్యక్షుడు తిరుకోటి నాగేశ్వరరావు, కోరుకొండ ఆనందరావు, పెద్దలు సబ్బతి శ్రీను, కమిడి బాలయోగి, గిడ్ల వెంకన్న, మాజీ మున్సిపల్ చైర్మెన్ గిడ్ల చంద్రరావు, కన్నీడి అప్పారావు, మెల్లం చిన్న, జనిపల్లి వెంకన్నబాబు, మెల్లం నూకాంబరం, మోకా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

> **అందరికీ అందించాలి**
>
> **ఎమ్మెల్యే అశోక్**
>
> **యానాం:** గ్యాస్ పైపులైన్ లీకేజీ అనంతరం జరిగిన అగ్నిప్రమాదం ఘటనల నేపథ్యంలో జరిగిన నష్టానికి సంబంధించిన పరిహారం అన్ని గ్రామాలకు అందజేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. గురువారం స్థానిక ఆర్ఏఓ ఆఫీసులో ఆర్ఏఓ అంకిత్‌కుమార్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తీర ప్రాంత గ్రామాలతో పాటు, వాటికి చేర్చి ఉన్న దరియాలతిప్ప, దొమ్మేటిపేట, సీతారామనగర్‌తో పాటు, యానాం నియోజకవర్గ పరిధిలోని అన్ని కుటుంబాలకూ పరిహారం అందజేయాలని కోరారు. దీనిపై ఇప్పటికే పుదుచ్చేరి ఎల్జీ కైలాషనాథన్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

మాగాపు మృతికి ప్రముఖుల సంతాపం



మాగాపు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్ తదితరులు

యానాం: పట్టణ వర్తక సంఘం నేత, బీజేపీ మాజీ అధ్యక్షుడు, ప్రజా పోరాటాల ఉద్యమకారుడు మాగాపు సుబ్బారావు ఆకస్మిక మృతికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తదితర ప్రముఖులు గురువారం సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే అశోక్, మల్లాడి కృష్ణారావు ఆయన నివాసానికి వెళ్లి సుబ్బారావు భౌతికదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. సివిల్‌రైట్స్ సొసైటీ అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి, తెలగ అభ్యుదయ సంఘం అధ్యక్షుడు కాటంశెట్టి రామ్మూర్తి, వర్తక సంఘం అధ్యక్షుడు నల్లా వెంకన్న, అన్నాడీఎంకే కార్యదర్శి మంచాల సాయి, వ్యాపారవేత్త తోట రాజు, ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి సామ్యూల్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, ఇతర నాయకులు, ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాజులూరు: గొల్లపాలెం–యానాం రహదారిలో చేదువాడ వంతెన వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన వక్కలంక సతీష్‌కుమార్ తన స్కూటర్‌పై కాజులూరు వచ్చి తిరిగి వెళుతున్నాడు. చేదువాడ వంతెన దిగువలో సెంటరుకు వచ్చేసరికి స్కూటర్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గోతిలో పడింది. ఈ సంఘటనలో సతీష్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు గొల్లపాలెంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.

డ్రైన్ పొంగె.. దుర్గంధం వెదజల్లే..



ఎర్ర వంతెన వద్ద డ్రైన్ నుంచి రోడ్డుపై పొంగిన మురుగునీరు

అమలాపురం టౌన్: పట్టణంలోని ఎర్ర వంతెన వద్ద ఉన్న డ్రైన్ పొంగి పొర్లి సీసీ రోడ్డును ముంచెత్తుతోంది. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ డ్రైన్ నిర్మాణ సమయంలో అవుట్‌లెట్లపై ఇంజినీరింగ్, శానిటేషన్ యంత్రాంగానికి సరైన అవగాహన లేకపోవడంతో ఈ దుస్థితి తలెత్తుతోందని చెబుతున్నారు. ఇదే పరిస్థితి పట్టణంలో పలుచోట్ల ఏర్పడినా మున్సిపల్ శానిటేషన్ అధికారులు అంతగా పట్టించుకోవడం లేదంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఎర్ర వంతెన రోడ్డు మురికికూపంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది.

తెగుళ్లు అరికడితే మంచి దిగుబడులు

కొత్తపేట: ఉద్యాన పంటలను నిరంతరం గమనిస్తూ వాటిపై వ్యాపించిన తెగుళ్లు, పురుగులను అరికడితే మంచి దిగుబడులతో అధిక ఆదాయం ఆర్జించవచ్చని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం అంబాజీపేట పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధన్, డాక్టర్ వి.అనూష రైతులకు సూచించారు. ఆత్రేయపురం మండలం వెలిచేరు, వద్దిపర్రు గ్రామాల్లో ఉద్యాన పంటలను కొత్తపేట ప్రాంతీయ ఉద్యాన అధికారి జి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రధానంగా పూల పంటలైన లిల్లీ, కనకాంబరం, గులాబీ, బంతి, చామంతి, అలాగే అరటి, కోకో, బొప్పాయి, కొబ్బరి పంటలను పరిశీలించారు. ఆయా పంటల్లో ఏమైనా కొత్త తెగుళ్లు వ్యాపించాయా? అని నిశితంగా పరిశీలించారు. పూల పంటల్లో తెగుళ్లు, పురుగులను గుర్తించి వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలు, యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు వివరించారు. అంతర పంటల సాగుతో అధిక ఆదాయంపై అవగాహన కల్పించారు. వెలిచేరులో మనే రాంబాబు అనే అభ్యుదయ రైతు చేపడుతున్న సేంద్రియ వ్యవసాయ విధానాలు పరిశీలించారు.

ప్రయాణం.. ప్రమాదం

- ప్రమాదకరంగా దంగేరు–కుడుపూరు రహదారి
- తరచూ యాక్సిడెంట్లు
- రోడ్డులోని మలుపులో ఘటనలు
- పట్టించుకోని అధికారులు



దంగేరు – కుడుపూరు రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశం



గతంలో జరిగిన ప్రమాదంలో ధ్వంసమైన వాహనం

కె.గంగవరం: ఆ రోడ్డులోని మలుపు చాలా ప్రమాదకరంగా మారింది. దానికి తోడు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలతో ముందు వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. రాకపోకలకు వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారుల్లో చలనం లేకపోవడం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. కె.గంగవరం నుంచి దంగేరు, కుడుపూరు మీదుగా పేకేరు వరకు రహదారి ఉంది. దీనిలో దంగేరు నుంచి పేకేరు వరకు టేకి డ్రైన్‌ను అనుకుని ఉంటుంది. రెండేళ్ల క్రితం ఈ రోడ్డును ఆర్‌అండ్‌బీ అధికారులు అభివృద్ధి చేశారు. ఇదిలా ఉండగా దంగేరు నుంచి కుడుపూరు వరకు గల రహదారిలో సావరం దాటిన తర్వాత మలుపు ప్రమాదకరంగా మారింది. మార్జిన్లు తక్కువగా ఉండడంతో పాటు తుప్పలు పెరగడం, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేని పరిస్థితి ఏర్పడింది.

పలు ప్రమాదాలు

ఈ రహదారిలో జరిగిన ప్రమాదాల్లో కొందరు మృత్యువాత పడ్డారు. ఒక ఆటో ప్రమాదంలో ఒకరు, లారీ ప్రమాదంలో మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి కన్నుమూశారు. రోడ్డు పక్కనే టేకి డ్రైన్ ఉండటంతో పాటు ఇరువైపులా పెరిగిన తుప్పల కారణంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా తుప్పల కారణంగా ఎదురుగా వచ్చే కనిపించడం లేదు. రాత్రి వేళల్లో ప్రయాణం మరింత ప్రమాదంగా మారింది. గతేడాది కురకాళ్లపల్లి గ్రామానికి చెందిన సూరంపూడి శ్రీనివాస్ (40) ఇదే రోడ్డులో జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. ఇదే ప్రాంతంలో వాహనాలు పల్టీలు కొట్టి పలువురు గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదాలకు ప్రధాన కారణం మలుపేనని స్థానికులు చెబుతున్నారు.

భయం భయంగా..

ఈ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదనే విమర్శలున్నాయి. దంగేరు నుంచి కుడుపూరు మీదుగా పేకేరు వరకు సుమారు ఏడు కిలోమీటర్ల మేర టేకి డ్రైన్‌ను అనుకుని ఆర్‌అండ్‌బీ రహదారి ఉంది. నిత్యం వందల వాహనాలు ఇదే రోడ్డు మీదుగా వెళుతుంటాయి. దీనితో పాటు పేకేరు, కుడుపూరు, భట్లపాలిక తదితర ప్రాంతాల నుంచి పాఠశాలలు, కళాశాలల బస్సులు కూడా తిరుగుతుంటాయి. ఈ రోడ్డు ప్రమాదకరంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

> **రోడ్డును వెడల్పు చేయాలి**
>
> 
>
> దంగేరు నుంచి పేకేరు వరకు గల రోడ్డును వెడల్పు చేయాలి. సావరం రోడ్డు నుంచి కుడుపూరు వరకు గల రహదారి చాలా ప్రమాదకరంగా ఉంది. ఆర్ అండ్‌బీ అధికారులు దీనిపై దృష్టి సారించాలి.
>
> – రాయుడు జగన్, పేకేరు

> **హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి**
>
> 
>
> ఈ రోడ్డులో ప్రమాదాలు జరుగుతున్నా, వాటి నివారణకు అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి తుప్పలను తొలగించడంతో పాటు బెర్మలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
>
> – మేడిశెట్టి ఇజ్రాయేలు, మసకపల్లి